# మంచిర్యాలలో 2కే రన్



2కే రన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, ఫిబ్రవరి 27 : ఆర్థిక అక్షరాస్య తవారోత్సవాల్లో భాగంగా మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తా నుంచి ఐబీ చౌరస్తా వరకు కలెక్టర్ బదావత్ సంతోష్.. అదనపు కలెక్టర్ మోతీలాల్, లీడ్‌డిస్ట్రిక్ మేనేజర్ తిరుపతి 2కే రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొదుపు చేయడం అలవాటు చేసుకుంటే ఆర్థికాభివృద్ధి చెందవచ్చన్నారు. సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం, ఓటీపీ తదితర వివరాలేవీ బయటవారికి చెప్పవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | బుధవారం 28 ఫిబ్రవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

# పిల్లల దొంగలనుకొని..

మతిస్థిమితం లేని వ్యక్తిని విచారిస్తున్న పోలీసులు



భీమారం, ఫిబ్రవరి 27 : మంచిర్యాల జిల్లా బూర్గుపల్లి గ్రామానికి సోమవారం రాత్రి ఓ మతిస్థిమితం లేని వ్యక్తి రాగా, పిల్లల దొంగ అనుకొని గ్రామస్తులు బంధించి చితకబాదారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. అలాగే మంగళవారం ఉదయం ఖాజీపల్లి గ్రామంలోకి మరో వ్యక్తి రావడంతో పిల్లల ఎత్తుకెళ్లే వ్యక్తి అని అనుమానించి పట్టుకున్నారు. ఆపై పోలీసులకు అప్పగించగా, వారిద్దరినీ విచారించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన వారిగా గుర్తించి.. మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో వదిలిపెట్టారు. కాగా, పిల్లలను ఎత్తుకెళ్లే దొంగలు వచ్చారంటూ సోషల్ మీడియాలో వైరల్ కాగా, ప్రజలు భయాందోళనకు గురయ్యారు.



గిరిజన గురుకుల కళాశాలలో ఇన్విజిలేటర్లతో సమావేశం నిర్వహిస్తున్న సీఎస్ సురేశ్, డీవో అమరేందర్ రెడ్డి

# ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి ఎగ్జామ్స్
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- సీసీ కెమెరాల నిఘా.. 144 సెక్షన్ అమలు
- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

మంచిర్యాల అర్బన్/ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 27 : ఈ నెల 28వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతుండగా, యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. మార్చి 14వ తేదీ వరకు జనరల్, 16వ తేదీ వరకు బ్రిడ్జి కోర్సుల వారికి ఎగ్జామ్స్ జరుగనున్నాయి. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా 25 కేంద్రాలు ఏర్పాటు చేయగా, మొదటి సంవత్సరంలో 8,394 మంది, రెండో సంవత్సరంలో 7,135 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అలాగే కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా 19 కేంద్రాలను ఏర్పాటు చేయగా, మొదటి సంవత్సరంలో 5,423 మంది, ద్వితీయ సంవత్సరంలో 5,003 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

## కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు

పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. బెంచీలు, తాగునీటి సౌకర్యం, ఫ్యాన్లు, టాయిలెట్స్ సౌకర్యంతో పాటు మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఇంటర్ పరీక్షల నిర్వహణకు కలెక్టర్ చైర్మన్‌గా, డీఐఈవో కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ అధికారులు విధులు నిర్వహించనున్నారు. ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్ చొప్పున, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్, నాలుగు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, డెక్ కమిటీలోని ముగ్గురు విధుల్లో పాల్గొంటారు.

## సీసీ కెమెరాల నిఘాలో..

అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. 100 మీటర్ల దూరం వరకు జిరాక్స్ కేంద్రాలు తెరవకుండా చర్యలు తీసుకుంటున్నారు.

## నిమిషం నిబంధన..

ఇంటర్మీడియట్ పరీక్షలకు నిమిషం నిబంధన వర్తించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగనున్న పరీక్షలకు విద్యార్థులు గంట ముందుగానే చేరుకోవాలన్నారు. 9 గంటల తర్వాత నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని స్పష్టం చేశారు.

## నిమిషం ఆలస్యమైనా అనుమతివ్వం

**- శైలజ, డీఐఈవో, మంచిర్యాల**

పరీక్షా కేంద్రాల్లోకి ఉదయం 8 గంటల నుంచి అనుమతిస్తాం. 8.45 గంటలకు విద్యార్థులకు బుక్‌లెట్‌లు ఇస్తాం. 9 గంటల వరకు లోపలికి అనుమతిస్తాం. ఆపై నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు. సీసీ కెమెరాల ముందు ప్రశ్నపత్రాలను ఓపెన్ చేయడం జరుగుతుంది. సెల్‌ఫోన్‌లు, స్మార్ట్ వాచ్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులేవీ తీసుకురావద్దు.

## అన్ని ఏర్పాట్లు చేశాం

**- నైతం శంకర్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, ఆసిఫాబాద్**

ఇంటర్ పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు చేశాం. ప్రతి కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాం. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేశాం.

# సీజన్‌కు ముందే నకిలీ దందా

## ఉమ్మడి జిల్లాలో జోరుగా గ్లైసిల్ పత్తి విత్తనాల వ్యాపారం

- ఇప్పటికే పలుచోట్ల భారీగా డంప్‌లు.. పల్లెలకు సరఫరా
- ఇటీవల 20 క్వింటాళ్లు పట్టివేత
- కాంగ్రెస్ నేత మధ్యవర్తిత్వం.. పోలీసుల సహకారంతో మాయం
- అధికారుల తీరుపై విమర్శలు



మంచిర్యాల జిల్లాలో పట్టుబడ్డ నకిలీ విత్తనాలు (ఫైల్)

మంచిర్యాల, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి జిల్లాలో నకిలీ పత్తి విత్తనాల దందా జోరుగా సాగుతున్నది. సీజన్ ప్రారంభానికి ముందు అధికారులు, పోలీసుల నిఘా ఉంటుందని భావిస్తున్న వ్యాపారులు ఇప్పటి నుంచే గ్లైసిల్ విత్తనాలు తీసుకొచ్చి డంప్‌లు చేస్తూ, పల్లెలకు చేరవేస్తున్నట్లు తెలుస్తున్నది. ఇప్పటికే భారీగా నిల్వలున్నట్లు సమాచారముండగా, ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా మార్కెట్‌ను ముంచెత్తే అవకాశమున్నది. ఈ క్రమంలో 10 రోజుల కింద భీమిని ప్రాంతంలో 20 క్వింటాళ్ల విత్తనాలను పోలీసులు పట్టుకోగా, అన్నీ తానై నడిపించే అధికార పార్టీ నేత ఒకరు మధ్యవర్తిత్వం చేసి పోలీసులకు భారీ మొత్తంలో డబ్బులు ముట్టజెప్పినట్లు తెలిసింది. దీంతో ఆ 20 క్వింటాళ్ల విత్తనాలు కనపడకుండా పోయినట్లు సమాచారం. నకిలీ విత్తనాలపై నిఘా పెట్టి.. వాటిని అరికట్టాల్సిన పోలీసు, రెవెన్యూ, వ్యవసాయశాఖల అధికారులే కాసులకు కక్కుర్తిపడి నకిలీ వ్యాపారానికి సహకరిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో యేటా గ్లైసిల్ విత్తనాలు అమ్ముతూ వ్యాపారులు కోట్లు గడిస్తున్నారు. మంచిర్యాల, బెల్లంపల్లి, నెన్నల, భీమిని, కన్నేపల్లి, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి, సిర్పూర్, ఆసిఫాబాద్ చుట్టు పక్కల ప్రాంతాల్లో నకిలీ విత్తనాల దందా యథేచ్ఛగా సాగుతున్నది. ఆంధ్రా ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు ఇక్కడ పాగావేసి ఈ వ్యవహారం నడిపిస్తున్నారు. ప్రతి ఫిబ్రవరి, మార్చి నెలల్లోనే నకిలీ విత్తనాలు క్వింటాళ్ల కొద్దీ గ్రామాల్లోకి డంప్ చేస్తున్నారు. అనంతరం గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు వాటిని అంటగడుతున్నారు.

### 60 శాతం ఆ విత్తనాలే..

జిల్లాలో ఇప్పటికే చాలా చోట్ల డంప్‌లు తీసుకువచ్చి పెట్టినట్లు తెలుస్తున్నది. గతేడాది సైతం దాదాపు 60 శాతం మంది రైతులు గ్లైసిల్ విత్తనాలే సాగుచేశారు. ఇలాసాగు చేసిన రైతులు పూర్తి స్థాయిలో నష్టపోయారు. గడ్డి మొలవదనే ఉద్దేశంతో రైతులు వీటిపైపు మొగ్గు చూపుతున్నారు. వారి అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. గ్లైసిల్ విత్తనాలు పర్యావరణానికి హానికరం. వాటిని వేస్తే నేల నిస్సారం అవుతుంది. దాని ప్రభావం దీర్ఘకాలంలో చూపిస్తుంది. ఈ విషయాలన్నీ రైతులకు వివరించడంలో అధికారులు విఫలమవుతున్నారు. దీంతో నాలుగేళ్లుగా నకిలీ విత్తనాల సమస్య పెరిగిపోతూనే ఉంది. రైతులకు శ్రమ తగ్గడంతో ఈ సంవత్సరం కూడా అవే సాగు చేయాలని దళారులను ఆశ్రయిస్తున్నారు. కలుపు కష్టం లేకుండా దిగుబడి కోసం గ్లైసిల్ విత్తనాలపై ఆధారపడుతున్నారు. రైతుల అవసరాన్ని ఆసరా చేసుకొని వ్యాపారులు కోట్ల రూపాయలు సొమ్ముచేసుకుంటున్నారు. ముఖ్యంగా బెల్లంపల్లి డివిజన్ పరిధిలో ఈ వ్యాపారం కోట్లలో సాగుతున్నది. బెల్లంపల్లిలోని ఓ వ్యాపారి ఈ గ్లైసిల్ విత్తనాలు అమ్ముతున్నారు. ఆయనే భీమిని, నెన్నల, దహెగాం తదితర ప్రాంతాల్లోని చిన్న వ్యాపారులకు వీటిని పంపిస్తున్నాడు. తాండూరు మండలంలో సైతం ఓ వ్యాపారి ఈ గ్లైసిల్ విత్తనాల వ్యాపారం చేస్తున్నారు. ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి సైతం మంచిర్యాల జిల్లాలోని కొన్ని మండలాల్లో ఈ దందా చేస్తున్నారు. గతంలో ఈ వ్యవహారంలో దొరికినా.. ఆయన మళ్లీ అవే విత్తనాలు అమ్ముతున్నారు. భీమిని, కన్నెపల్లి ప్రాంతాల్లోని కొందరు వ్యాపారులు ఇప్పటికే ఈ విత్తనాలు నిల్వ చేసుకున్నట్లు తెలిసింది. ఇక కాగజ్‌నగర్‌లోనైతే వ్యాపారులు ఇప్పటికే చుట్టు పక్కల మండలాలకు విత్తనాలు సరఫరా చేయడం మొదలుపెట్టినట్లు సమాచారం.

### కాంగ్రెస్ నేత మధ్యవర్తిత్వం..

10 రోజుల క్రితం భీమినిలో నకిలీ విత్తనాలను పోలీసులు పట్టుకున్నారు. కానీ ఓ కాంగ్రెస్ నేత మధ్య వర్తిత్వం చేయడంతో వాటిని వదిలేశారు. ఈ వ్యవహారంలో ఖాకీలకు డబ్బులు ముట్టినట్లు ప్రచారం జరుగుతున్నది. అదే సమయంలో ఆ కాంగ్రెస్ నేత బెల్లంపల్లి పరిధిలో వ్యాపారం చేసుకుంటున్న తొమ్మిది మంది ఆంధ్రా ప్రాంత విత్తన వ్యాపారులతో సమావేశం నిర్వహించి తలా రూ.15 లక్షలు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ వ్యవహారం కాస్తా.. ఆ నోటా, ఈ నోటా బయటికి రావడంతో ఆ ఒప్పందం ఆగిపోయింది. కానీ ఎప్పటికైనా నకిలీ విత్తనాలు తీసుకురావాలనే కృత నిశ్చయంతో సదరు నేత ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ మేరకు పోలీసులతో పాటు వ్యవసాయశాఖలో క్షేత్రస్థాయిలో పని చేసే అధికారి మొదలు జిల్లా స్థాయి వరకు అందరికీ సెటిల్ చేసే ఉద్దేశంతోనే భారీగా వసూళ్లు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. దొంగచాటుగా విత్తనాలు కొనుగోలు చేస్తుండడంతో పంట నష్టపోయినప్పుడు రైతులకు పరిహారం రావడం లేదు. ఎకరాకు 15 నుంచి 18 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని చెప్పినా.. ప్రస్తుతం 7 క్వింటాళ్లకు మించట్లేదు. కొన్నిచోట్ల నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల దిగుబడే వస్తున్నది. ఇప్పటికైనా ఉన్నతస్థాయి అధికారులు దృష్టి సారించకపోతే నకిలీ విత్తనాలకు రైతులు బలికాక తప్పదు.

# ఇంటి అనుమతులిప్పిస్తమని లంచం తీసుకున్నారు

**గత మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, అటెండర్ ఫక్రుద్దీన్‌పై చైర్మన్‌కు బాధితుల ఫిర్యాదు**



మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్యకు ఫిర్యాదు చేస్తున్న రమేశ్‌యాదవ్

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 27 : ఏడాది క్రితం సస్పెండై ప్రస్తుతం వేరే మున్సిపాలిటీలో పనిచేస్తున్న కమిషనర్ బాలకృష్ణపై అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. మంచిర్యాల మున్సిపాలిటీలో పనిచేసిన కాలంలో ఇంటినిర్మాణ అనుమతులు ఇప్పిస్తామని బాలకృష్ణ, అటెండర్ లంచం తీసుకున్నారంటూ బాధితులు చైర్మన్ ఉప్పలయ్యకు ఫిర్యాదు చేశారు. గతంలో అమరగాని రమేశ్‌యాదవ్ రాంనగర్‌లో ఇల్లు కొనుగోలు చేశాడు. మూడు అంతస్థులున్న ఇంటిపై మరో రెండు అంతస్థులు నిర్మించాడు. ఇందుకోసం అనుమతులు ఇప్పిస్తానని చెప్పి అటెండర్ ఫక్రుద్దీన్ రూ. 5 లక్షలు వసూలు చేశాడు. ఇంటికి పర్మిషన్ ఇప్పించకపోగా, అదనంగా నిర్మించిన అంతస్థులకు టాక్స్ విధించి రసీదు అందించాడు. ఆపై ఇంటి అనుమతులు రాలేదని నేరుగా కమిషనర్ బాలకృష్ణను సంప్రదించాడు. ఇంటిపైన నిర్మించిన అంతస్తులకు పర్మిషన్ కావాలంటే రూ. 15 లక్షలు కావాలని చెప్పడంతో, నమ్మి ఆయనకు రూ. 15 లక్షలు అందించాడు. కానీ ఇంతవరకు ఇంటి అనుమతులు రాలేదు. ఈ మేరకు విసిగిపోయిన రమేశ్‌యాదవ్ మంగళవారం మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్యను కలిసి తన గోడు వెల్లబోసుకున్నాడు. తనకు న్యాయం జరిగేలా చూడాలని వేడుకున్నాడు. గతేడాది ఫిబ్రవరిలో కమిషనర్ భార్య ఇంట్లో ఉరేసుకుని మృతిచెందిన ఘటనలో బాలకృష్ణను సస్పెండ్ చేశారు. అలాగే పట్టణంలోని సప్తగిరి కాలనీకి చెందిన సౌజన్యరాణి తన ఇంటికి పర్మిషన్ ఇప్పిస్తానని చెప్పి 2014లో అటెండర్ ఫక్రుద్దీన్ రూ. 25 వేలు తీసుకున్నాడని మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్యకు ఫిర్యాదు చేశారు. డబ్బులు తీసుకుని ఇంటి అనుమతులు ఇప్పించలేదని, తనకు న్యాయం చేయాలని కోరారు.

## విజిలెన్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్తా..

**- మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య**

ఇక్కడ పనిచేసిన మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ అవినీతి వ్యవహారాన్ని విజిలెన్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్తానని మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య తెలిపారు. ఇంటి నిర్మాణ అనుమతుల విషయంలో పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేయడం దారుణమైన విషయమని, విజిలెన్స్ అధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ లేఖ రాస్తానన్నారు. డబ్బులు వసూలు చేసినట్లు అటెండర్‌పై వచ్చిన ఆరోపణలపై విచారణ జరపాలని కమిషనర్‌ను ఆదేశించడం జరిగిందని చెప్పారు.

## కేసీఆర్ సర్కారు పుణ్యమే



*గతేడాది 6 ఎకరాల్లో మిరప వేసిన. 190 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ ఏడాది 15 ఎకరాల్లో సాగు చేసిన. వాతావరణంలో మార్పుల కారణంగా చీడపీడలు పెరిగాయి. దిగుబడి తగ్గే అవకాశముంది. ఈ ఏడాది 400 క్వింటాళ్ల వరకు వస్తుందనుకుంటున్న. ఇప్పుడే పంట తెంపుతున్నం. ఇప్పటి వరకు రూ. 20 లక్షల వరకు పెట్టుబడి అయ్యింది. పంట మొత్తం వచ్చేసరికి ధరను బట్టి మాకు ఎంత లాభం వచ్చేది తెలుస్తుంది. ఈ రోజు ఇంత పంట సాగు చేస్తున్నానంటే అది కేసీఆర్ ప్రభుత్వం పుణ్యమే. రైతులకు ఉచితంగా 24 గంటల కరెంటు ఇచ్చిన నాయకుడు కేసీఆర్. మాజీ ఎమ్మెల్యే కోనప్ప మా రైతుల కోసం నిరంతరం కష్టపడ్డాడు.*

***-బడిగె దామాజీ, రైతు తాటిపల్లి***



తాటిపల్లి గ్రామంలో మిరప పంటను తిరగ వేస్తున్న రైతులు

# మిరప సిరులు

## కౌటాల మండలంలో 1100 ఎకరాల్లో మిర్చి సాగు

- ఒక్క తాటిపల్లిలోనే 750 ఎకరాలు
- కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రతి రైతుకూ విద్యుత్ కనెక్షన్
- కలిసొచ్చిన 24 గంటల కరెంట్
- అన్నదాతల ఆర్థికాభివృద్ధికి ఊతం



తాటిపల్లి గ్రామంలో నిండుగా కాసిన మిరప పంట

కౌటాల, ఫిబ్రవరి 27 : తాటిపల్లి గ్రామ రైతులు మిర్చి సాగులో రాణిస్తూ సిరులు కురిపిస్తున్నారు. కేసీఆర్ సర్కారులో విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వగా, రంది లేకుంట పంట తీస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కౌటాల మండల వ్యాప్తంగా 1100 ఎకరాల్లో ఈ మిరప సాగవుతున్నది. గతేడాది తాటిపల్లి గ్రామంలో 120 మంది రైతులు 318 ఎకరాల్లో మిరప సాగు చేశారు. ఈ ఏడాది 180 మంది రైతులు ఏకంగా 750 ఎకరాల్లో పంట వేశారు. గతేడాది ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల మిరప దిగుబడి వచ్చింది. కానీ ఈ ఏడాది వాతావరణ ప్రభావంతో ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశమున్నట్లు రైతులు చెబుతున్నారు.

### వ్యవసాయ కనెక్షన్లతో పెరిగిన సాగు

కేసీఆర్ ప్రభుత్వం హయాంలో సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రత్యేక దృష్టి పెట్టి ప్రతి రైతు పొలాలకు విద్యుత్ కనెక్షన్‌లు ఇప్పించారు. గతేడాది తాటిపల్లిలో ఏకంగా 250 కొత్త వ్యవసాయ కనెక్షన్లు, 30 డీటీఆర్‌లు, కొత్త విద్యుత్ లైన్లు, స్తంభాలు ఏర్పాటు చేశారు. దీనికి తోడు 24 విద్యుత్ కలిసి వచ్చింది.

### పంట ఖర్చు, దిగుబడి..

ఎకరా మిరప పంట సాగు చేసేందుకు రూ. లక్ష నుంచి రూ. 1.5 లక్షల వరకు ఖర్చవుతుంది. ప్రస్తుతం మిరప పంట ధర రూ. 21 వేల నుంచి రూ. 23 వేల వరకు ఉండగా, సుమారు ఎకరాకు రూ. 5 లక్షల దాకా వచ్చే అవకాశం ఉంది. అన్ని ఖర్చులు పోను రైతుకు ఎకరాకు రూ. 3 నుంచి రూ. 3.5 లక్షల వరకు లాభాలు వస్తాయి.. అయితే పంటను అమ్ముకోవాలంటే రైతులంతా మహారాష్ట్రలోని నాగపూర్‌కి వెళ్లాల్సిందే. దీంతో రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఈ ప్రాంతంలో ప్రత్యేకంగా కోల్డ్ స్టోరేజ్ గోదాంలను ఏర్పాటు చేసేందుకు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హామీనిచ్చారు. కానీ ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో, ఆ హామీ అలాగే మిగిలిపోయింది.

## మూడెకరాల్లో మిర్చి వేసిన..



*నేను పోయినేడు 1.5 ఎకరాల్లో మిరప వేసిన. నాకు 42 క్విం టాళ్ల దిగుబడి వచ్చింది. ఈ ఏడాది 3 ఎకరాల్లో వేసిన. ఈ ఏడాది పంట దిగుబడి తగ్గుతుందేమో కానీ లాభాలు వస్తాయనిపిస్తున్నది. ఇప్పుడు మహారాష్ట్రలో క్వింటాలుకు రూ. 22 వేల వరకు ధర పలుకుతుంది. ఈ ఏడాది 80 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చినా కూడా నాకు నష్టమేమీ లేదు. అన్ని ఖర్చులు పోను రూ. 12 లక్షల నుంచి రూ. 14 లక్షలు వస్తాయి. ఇతర ఏ పంటలు వేసినా ఇంత లాభాలు రావు.*

***-రోహినే రవీందర్, రైతు, తాటిపల్లి..***

## కోనప్ప సార్ ఇప్పించిండు



*నేను 20 ఏండ్ల సంది మిరప సాగు చేస్తున్న. పో యినేడు 3 ఎకరాల్లో వేసిన. ఇప్పుడు 5 ఎకరాల్లో వేసిన. గతంలో పంటకు నీళ్లు పెట్టాలంటే మస్తు తిప్పలయ్యేది. నేను మహారాష్ట్ర పోయి మోటర్ కొనుక్కున్న. అప్పుడు ఎమ్మెల్యే కోనప్ప సార్ ఉండే. నా చేనును చూసి ఎట్లా పండిస్తున్నవని అడిగినప్పుడు కరెంటు కష్టాల గురించి చెప్పిన. వెంటనే ఎంత మంది రైతులున్నారో వారందరి వివరాలివ్వు అన్నడు. వివరాలిచ్చిన వారంలోనే అందరికీ కరెంట్ ఇప్పించిండు. 24 గంటల కరెంటుతో కావాల్సినప్పుడు పంటకు నీళ్లు పెట్టుకుంటున్నం. మంచిగ బతుకుతున్నం.* ***-తాంగ్డే ప్రభాకర్, రైతు, తాటిపల్లి***

## 24 గంటల కరెంటుతోటే పంటలు..



*మా రైతులకు కేసీఆర్ సారు మంచిచే సి పుణ్యం కట్టుకున్నడు. వ్యవసాయానికి 24గంటల కరెంటిచ్చిండు. దీంతోటి పంటల సాగు పెరిగింది. ఈ ఏడాది 2 ఎకరాల్లో మిర్చి పంట వేసిన. కాయలు కూడా కోతకు వచ్చినయ్. ఇప్పుడు కోస్తున్నం. పంట మంచిగున్నది. ఇయ్యాల మా ఊరి రైతులు ఆర్థికంగా లబ్ధి పొందుతున్నరంటే కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే కోనప్పల పుణ్యమే.*

***-నాగపురే ధనరాజ్, రైతు, తాటిపల్లి***

# చదువుకుంటేనే లక్ష్యాన్ని చేరుకోగలం



మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్ కుమార్

సిర్పూర్(టీ), ఫిబ్రవరి 27 : చదువుకుంటేనే లక్ష్యాన్ని చేరుకోగలమని కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ కే సురేశ్‌కుమార్ పేర్కొన్నారు. పోలీసులు-మీకోసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం సిర్పూర్(టీ) మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కృషి, పట్టుదల, సమయపాలన విజయానికి ముఖ్య సూత్రాలన్నారు. ఎక్కడో మారుమూల గ్రామంలో చదువుకొని ప్రస్తుతం మన జిల్లాకు ఎస్పీగా పని చేస్తున్నానన్నారు. ప్రతి విద్యార్థి ఒత్తిడిని అధిగమిస్తే విజయం సాధించవచ్చని సూచించారు. అనంతరం 575 మంది పదో విద్యార్థులకు పరీక్షల మెటీరియల్స్ అందించారు. అంతకుముందు ఎస్పీకి విద్యార్థులు అపూర్వ స్వాగతం పలికారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, కౌటల సీఐ సాదిక్‌పాషా, సిర్పూర్(టీ) ఎస్ఐ దీకోండ రమేశ్, జిల్లా గురుకులాల కో ఆర్డినేటర్ పోలోజు బాలరాజు, ప్రిన్సిపాల్ సంగీత పాల్గొన్నారు.

